

» జిల్లాలోని 19 ప్రభుత్వ పాఠశాలల్లో అమలు

» విద్యార్థులలో నైపుణ్య సామర్థ్యాల పెంపు

సర్కారు బడుల్లో ఏఐ తరగతులు



విద్యావ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని శాసిస్తోంది. అన్ని రంగాల్లో ఏఐ వినియోగం అనివార్యమైంది. తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఏఐని ప్రవేశపెట్టారు. విద్యార్థుల్లో యేటా అభ్యసన సామర్థ్యాలు తగ్గిపోవడాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు కృత్రిమ మేధా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ముందుగా ప్రాథమిక పాఠశాలల్లో చదివే వారిలో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఏఐ సహాయంతో పాఠాలు బోధించడం ప్రారంభించారు.

ముథోల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధించేందుకు జిల్లాలోని ఆయా మండలాల నుంచి మొత్తం 19 ప్రాథమిక పాఠశాలలను సర్కారు గుర్తించింది. వీటిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బెంగళూరుకు చెందిన ఏక్-స్టెప్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. అక్కడి విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించేందుకు చేపట్టిన కార్యక్రమం సత్ఫలితాలు ఆశించినస్థాయిలో రావడంతో మన రాష్ట్రంలో కూడా కృత్రిమమేధా (ఏఐ) సహాయంతో విద్యాబోధన ప్రారంభించారు. ప్రస్తుతం జిల్లాలో 17 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ విద్యాబోధన ప్రభుత్వం ప్రారంభించింది. ప్రతీ పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడికి తగు శిక్షణ సైతం ఇచ్చారు. పాఠశాలలో 3వ, 4వ, 5వ తరగతుల విద్యార్థులకు బేస్ లైన్ టెస్ట్ పెట్టి బీ, సీ గ్రేడ్ ఉంటే సామర్థ్యాల్లో వెనుకబడిన విద్యార్థులకు తెలుగు, గణితంలో మెరుగుపరిచేందుకు ఈ విధానం దోహద పడుతుంది.

జిల్లాలో 19 పాఠశాలలు ఎంపిక

జిల్లాలోని భైంసా మండలంలోని మిర్జాపూర్, మాటేగాం ప్రాథమిక పాఠశాలలు, దిలావర్‌పూర్ మండలంలోని గుండంపల్లి ప్రాథమిక పాఠశాల, ఖానాపూర్ మండలంలోని బీర్నంది, రాజు, సత్తెనపల్లి ప్రాథమిక పాఠశాలలు, లక్ష్మణచాంద మండలంలోని బాబాపూర్, పీచర ప్రాథమిక పాఠశాలు, ముథోల్ మండలంలోని మచ్కల్ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం, నిర్మల్ రూరల్‌లోని మేడిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, నిర్మల్ అర్బన్‌లోని సోమార్‌పేట్, ఈద్‌గాం ప్రాథమిక పాఠశాలలు, సారంగాపూర్ మండలంలోని చించోలి(ఎం) ప్రాథమిక పాఠశాల, వైకుంఠాపూర్ యూపీఎస్ ప్రాథమిక పాఠశాల, తానూర్‌లోని బేల్‌తరోడ ప్రాథమిక పాఠశాల, మామడలోని పరిమండల్, కొరటికల్ పాఠశాలలు, లోకేశ్వరంలోని రాజూరా ప్రాథమిక పాఠశాలను ఎంపికచేశారు. అయితే ఏఐ బోధించేందుకు పలువురు ఉపాధ్యాయులకు శిక్షణఇచ్చారు. ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) ప్రకారం ఒకటో తరగతి నుంచి 5 వరకు మార్చి 15 నుంచి విద్యాబోధన మొదలుపెట్టారు.

విద్యా సామర్థ్యాలు పెంచడమే లక్ష్యం

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో చదవడం, రాయడం గణితం సరిగా చేయకపోవడం వంటివి జరుగుతున్నాయి. అలాంటి విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి విద్యా సామర్థ్యాలను పెంపొందించడానికి ఏఐ ద్వారా విద్యాబోధన చేస్తున్నారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులు ఈ టూల్స్‌ను ఉపయోగించుకొని స్వయంగా విద్యార్థులే తెలుగు, ఇంగ్లీష్ భాషలో అక్షరాల గుర్తింపు, సరళ పదాలు, వారిస్థాయిని బట్టి పదాలను చదవడం, రాయడం, గణితంలో సంఖ్యలు రాయడం, కూడిక నుంచి మొదలుకొని భాగాహారం వరకు విద్యార్థులు స్వయంగా నేర్చుకోవడానికి ఏఐ దోహదపడుతుంది. దీనిద్వారా విద్యార్థుల్లో ఆసక్తిపెరిగి ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా చక్కగా నేర్చుకోవడానికి అవకాశం ఉంటుంది. వీటికి తోడుగా ఏఎక్సెల్ పేరుతో ఇంటెలిజెన్స్ విద్యను అందించనున్నారు. ఫస్ట్ లెవెల్‌లో డిస్కవరిలో ఏఐ పిల్లల శక్తిసామర్థ్యాలు తెలుసుకునేందుకు కొన్ని ప్రశ్నలు అడుగుతుంది. దృశ్య, శ్రవణం ద్వారా జవాబు కూడా చెబుతుంది. ఏఐలో ఎక్సైడ్ ఫ్లో ఫౌండేషన్ ఏఐ లెర్నింగ్ టూల్స్ అసిస్టెడ్ లాంగ్వేజ్ లెర్నింగ్ (ఏఎల్ఎల్), అసిస్టెడ్ మ్యాథమెటిక్ లెర్నింగ్ (ఏఎంఎల్) ఇన్‌స్టాల్ చేశారు. ఎఫ్ఎల్ఎన్ ద్వారా నేర్చుకున్న అంశాలను కంప్యూటర్ ముందు తప్పుగా చదివితే లోపాలను గుర్తిస్తుంది. ప్రధానంగా 3, 4, 5వ తగరతి చదువుతున్న విద్యార్థుల్లో చదువుల్లో వెనుకబడిన వారిలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఒక్కో బ్యాచ్‌గా విభజించి, ఒక్కో బ్యాచ్‌కు తెలుగు, గణిత అభ్యాసాలపై, 40 నుంచి 50 నిమిషాల పాటు కృత్రిమ మేధా పాఠ్యాంశాలను బోధన చేస్తున్నారు.

ప్రతీ పాఠశాలకు కంప్యూటర్‌లను అందిస్తే..

ఈ కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నప్పటికీ కొన్ని పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం ఉన్నా సక్రమంగా అందకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయని అలాగే కొన్ని పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం సక్రమంగా అందకపోవడంతో మొబైల్ ద్వారా వీటిని బోధించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా కొన్ని పాఠశాలల్లో కంప్యూటర్లు లేకపోవడంతో దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వెళ్లడం మూలంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. ఒకవేళ ప్రతీ పాఠశాలకు కంప్యూటర్ అందించి ఇంటర్నెట్ సౌకర్యం మెరుగుపరిచినట్లయితే విద్యార్థులకు సంపూర్ణంగా ఇది ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఉపాధ్యాయులు తెలియజేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి అన్ని పాఠశాలల్లో ఇంప్లిమెంట్ చేస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ప్రతీ విద్యార్థికి అన్ని సామర్థ్యాలు సక్రమంగా అందుతాయని పేర్కొంటున్నారు.

విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం



• నరేష్ కుమార్, హెచ్ఎం, గుండంపల్లి పాఠశాల

ఏఐ విద్య ద్వారా వెనుకబడిన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. దీని ద్వారా తెలుగు, గణితంలో సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి. విద్యార్థులు కూడా ఆసక్తిగా దీనిని నేర్చుకుంటున్నారు.

చతుర్విధ ప్రక్రియలు నేర్చుకుంటున్నారు



• ఎస్.కృష్ణ, ప్రధానోపాధ్యాయులు, చించోలి(ఎం)

ఏఐ విధానం వెనుకబడిన విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. తెలుగులో సరళమైన పదాలతోపాటు దిత్వాక్షరాలు నేర్చుకోవడం అలాగే చతుర్విధ ప్రక్రియలు విద్యార్థులు సులభంగా నేర్చుకుంటున్నారు.

సులభంగా అర్థమవుతున్నాయి



• లహస్య, నాల్గో తరగతి, విద్యార్థిని

గతంలో కంటే ఇప్పుడు నాకు తెలుగు, గణితం సులభంగా అర్థమవుతోంది. ఈ క్లాసు తప్పకుండా హాజరవుతున్న. మొదట్లో భయంగా ఉండేది. ఇప్పుడు ఇష్టంగా రోజు బడికి వస్తున్నాను.



ఉధృతంగా ప్రవహిస్తున్న కల్లూరు వాగు

వర్షానికి పొంగి పొర్లిన వాగులు

కుంటాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కుంటాల మండలంలోని వాగులు పొంగిపొర్లాయి. వర్షాకాలం ప్రారంభం నుంచి పెద్దగా వర్షాలు కురవలేదు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు నీటికళను సంతరించుకున్నాయి.

జిల్లాకు రూ.కోటి విడుదల

» విపత్తు నుంచి రక్షణకు ఈ నిధులతో పరికరాల కొనుగోళ్లు

» అందుబాటులోకి రానున్న రక్షణ పరికరాలు

» విపత్తుల వేళ సకాలంలో అందనున్న రక్షణ సేవలు



భైంసా, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వరదలు, ప్రకృతి విపత్తుల సమయాల్లో చోటు చేసుకునే ప్రాణ, ఆస్తి నష్టాల నివారించేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగానే విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ శనివారం జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిధులతో విపత్తుల నుంచి రక్షణ కల్పించే పరికరాలను కొనుగోలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రతిపాదనలతోనే..

ప్రతియేటా వర్షాకాలంలో ఏదో ఒక ప్రాంతంలో వరదల సమయంలో ఉపద్రవాలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి సమయంలో రక్షణ పరికరాలు అందుబాటులో లేక సుదూర ప్రాంతాల నుంచి సరఫరా చేయించుకోవాల్సి వస్తోంది. దీంతో సకాలంలో విపత్తుల నివారణ చర్యలు చేపట్టకపోవడం మూలంగా నష్ట తీవ్రతలు అధికమవుతున్నాయి. ఇలాంటి సమయంలో విపత్తుల రక్షణ పరికరాలు అందుబాటులో ఉంటే సకాలంతోపాటు ముందస్తు నివారణ చర్యలు చేపట్టేందుకు వీలుంటుందని కలెక్టర్ అభిలాష అభినవ్ వానకాలపు సీజన్ ఆరంభంలో ప్రభుత్వానికి ప్రతిపాదించారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలకు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తిచేశారు. ఇందులో భాగంగానే ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదించినట్లుగా తెలిసింది. కలెక్టర్ ప్రతిపాదనలు, విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం విపత్తుల నివారణకు జిల్లాకు రూ.కోటి చొప్పున నిధుల విడుదల చేసింది.

నష్టనివారణ ముందస్తు చర్యలకు మార్గం సుగమం

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ఎయిర్ బోట్లు, లైఫ్ జాకెట్లు, సైరన్లు, మైక్ సెట్లు, భారీ తాళ్లు, గ్యాస్ లైట్ కట్టర్లు, చెట్లు, పొదలు తొలగించే పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా విపత్తుల వేళ ప్రాణ, ఆస్తి నష్ట నివారణకు ముందస్తు చర్యలు చేపట్టేందుకు మార్గం సుగమం కానుంది. విపత్తుల వేళ సకాలంలో రక్షణచర్యలు చేపట్టేందుకు వీలు కానుంది.



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

మన్ కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు

నిర్మల్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ 124వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. ఇందులో కార్యక్రమంలో రాష్ట్రసంఘటన మంత్రి చంద్రశేఖర్ జీ, బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాయల్‌శంకర్, పాల్వాయి హరీష్, జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్, శిక్షణ తరగతుల కన్వీనర్ రావుల రాంనాథ్, జిల్లా బీజేపీ నాయకులు, ఇన్‌చార్జీలు, మండల అధ్యక్షులు, పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళి

నిర్మల్ రూరల్, జూలై27 (ఆంధ్రజ్యోతి): ఏపీజే అబ్దుల్ కలాం ఎడ్యుకేషనల్, వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పదవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మండలంలోని కొండాపూర్ గ్రామ సమీపంలో గల బాలసదనంలో బాల బాలికలకు పండ్లు పంపిణీ చేసినట్లు అధ్యక్షుడు మొహమ్మద్ అజారుద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో బాలసదనం కేర్ టేకర్ సుమలత, సొసైటీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ అన్వర్, కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ మసూద్, కార్యవర్గ సభ్యులు మహమ్మద్ అబ్దుల్ నజీమ్, వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

సాగు పనులను ప్రారంభించిన గిరిజనులు

కడెం, జూలై27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసంపేట్, రాంపూర్ పునరావాస గ్రామానికి చెందిన గిరిజనులు ఆదివారం వ్యవసాయ భూముల్లో పూజలు నిర్వహించి సాగు పనులను ప్రారంభించారు. పులి మనుగడ కోసం గత ఏడాది కవ్వాల్ టైగర్ జోన్ కోర్ ఏరియాలోని రెండు గ్రామాలను తరలించిన విషయం తెలిసిందే. పునరావాస పరిహారం కింద వీరికి సాగు భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందజేశారు.

వైభవంగా సుదర్శన యాగం

నిర్మల్‌రూరల్, జూలై27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీ వాడలో గల అలివేలు మంగ ఆలయంలో అంగరంగ వైభవంగా సుదర్శన యాగాన్ని టీకే కన్నన్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవరకోట చైర్మన్ ఆమెడ శ్రీధర్, డాక్టర్ ప్రవీణ్, గంధం సుధాకర్, పూసల శ్రీకాంత్, అనిల్, రాజు, బాపయ్య, రమేష్, రాజశేఖర్, పద్మ, విజయలక్ష్మి, మహిళా భక్తులు పాల్గొన్నారు.



యాగాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

బాసర వద్ద గోదావరి పరవళ్లు

• 50వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో • గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు 4వేల వరద



బాసర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



గడ్డెన్న వాగు ప్రాజెక్టు

బాసర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బాసర వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ఉన్న మహారాష్ట్రతో పాటు ఇక్కడ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నదిలో వరద పెరిగింది. మొన్నటివరకు నీరు లేక బోసిపోయి కనిపించిన గోదారమ్మ ఆదివారం వరద నీటితో కళకళలాడింది. ఎగువ మహారాష్ట్ర నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఆదివారం ప్రాజెక్టులోకి ఉదయం 10484 క్యూసెక్కుల వరద నీరు చేరగా క్రమంగా మధ్యాహ్నం కు 24500 క్యూసెక్కుల వరద పెరిగింది. సాయంత్రానికి ప్రాజెక్టులోకి 50,503 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. మహారాష్ట్రలోని బలేగావ్ ప్రాజెక్టు 5గేట్లతోపాటు ఇతర ప్రాజెక్టుల నుంచి వరద నీరు దిగువన శ్రీరాంసాగర్ నీటిని వదులుతున్నారు. దీంతో నదిలో నీటి ప్రవాహం పెరిగింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు 80.5 టీఎంసీలు కాగా ఆదివారం సాయంత్రానికి 1070.30 అడుగులు 24.806 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి.

గడ్డెన్నవాగుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

భైంసా, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల మూలంగా శనివారం 6200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, ఆదివారం 4200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ఈ క్రమంలో శనివారం ఉదయం ప్రాజెక్టు నీటిమట్టం 355.9 మీటర్లు, 0.568 నీటి నిల్వలు ఉండగా ఆదివారం మధ్యాహ్నం సమయానికి ఒక మీటర్ పెరిగి 356.9 మీటర్లకు, 0.918 టీఎంసీల నీటి నిల్వలకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు, 1.83 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుత వర్షాకాలపు సీజన్‌లో ప్రాజెక్టులోకి మొత్తం 0.563 టీఎంసీల వరద వచ్చి చేరింది. ఇక ప్రాజెక్టు ప్రాంతంలో ప్రస్తుత వానకాల సీజన్‌లో ఆదివారం నమోదైన వర్షపాతం 49.2 మి.మీటర్లను కలిపి ఇప్పటివరకు మొత్తం 388.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

చేతికి చిక్కిన చేపలతో యువకులు



అలుగు దూకింది.. చేప చిక్కింది!

దిలావర్‌పూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని సన్నవాగు అలుగు దూకుతోంది. టెంబుర్ని చెరువు నుంచి ఎదురీదుతూ సన్నవాగు వద్దకు చేరిన చేపలు.. వాటి కోసం ఎదురు చూస్తున్న కొంతమంది చేతికి చిక్కాయి. ఆ చేపలు కొంతమందికి ఆదివారం ఆహారంగా మారాయి.

తైక్వాండోలో రిక్వేతనకు 'బంగారం'

దిలావర్‌పూర్, జూలై27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన చిన్నారి కోడె రిక్వేతన తైక్వాండోలో ప్రతిభ కనబరుస్తూ శభాష్ అనిపించుకుంటోంది. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర తైక్వాండో చాంపియన్షిప్ పోటీల్లో ప్రతిభ చాటి అబ్బుర పరిచింది. అండర్-30 కేజీల విభాగంలో రాణించి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. గ్రామస్థులు చిన్నారి రిక్వేతనను అభినందించారు.



తైక్వాండోలో గోల్డ్ మెడల్ సాధించిన రిక్వేతన

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, జూలై27 (ఆంధ్రజ్యోతి): జీపీవో (గ్రామ పాలన అధికారులు), లైసెన్స్ సర్వేయర్ల నియామక పరీక్షల నిర్వహణను కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అదనపు కలెక్టర్ (రెవెన్యూ)తో కలిసి పట్టణంలోని చాకన్య హైస్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష గదుల్లో జరుగుతున్న పర్యవేక్షణ, అభ్యర్థుల హాజరు, నిబంధనలు పాటింపు, ప్రశ్నాపత్రాల పంపిణీ వంటి అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పరీక్షలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జీపీవో పరీక్షకు మొత్తం 55 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా, 37 మంది మాత్రమే హాజరయ్యారని 18 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అలాగే లైసెన్స్ సర్వేయర్ పరీక్షకు 110 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 84 మంది హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. తనిఖీల్లో ఆర్డీవో రత్న కళ్యాణి, నోడల్ అధికారి సుదర్శన్, పర్యవేక్షకులు మోతీరాం, సూర్యారావు, రాజేశ్వర్ గౌడ్, తహసీల్దార్ రాజు, పోలీస్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు

మొక్కలు నాటిన నాయకులు

దిలావర్‌పూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రారంభించి 8 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు డా.యు.సుభాష్ రావు, మండల కన్వీనర్ ఎలాల చిన్నారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం మొక్కలు నాటారు. రాజసభ ఎంపీ సంతోష్ రావు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారని సుభాష్‌రావు అన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు లక్షల మొక్కలు నాటినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అరుణ్, అశోక్ ఉన్నారు.

మూడు మండలాల టెంట్ హౌస్ కమిటీ నూతన కార్యవర్గం

ఖానాపూర్, జూలై27(ఆంధ్రజ్యోతి): ఖానాపూర్, పెంబి, కడెం మూడు మండలాల టెంట్‌హౌస్ కమిటీ నూతనకార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం ఖానాపూర్ పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మూడు మండలాల టెంట్‌హౌస్ యజమానుల సమావేశంలో అధ్యక్షుడిగా జనార్ధన్, గౌరవ అధ్యక్షుడిగా సుతారి రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి పెండల నరేష్, ఉపాధ్యక్షుడిగా వెంకట రమణ, శ్రీధర్, కోశాధికారిగా సాయిద్ జియా, కార్యదర్శిగా దాసరి లక్ష్మణ్, నిర్వాహకులుగా పంతుల నవీన్, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. ఖానాపూర్, పెంబి, కడెం మండలాల టెంట్ హౌస్ నిర్వాహకులు అందరూ ఏకతాటిపై పని చేసుకోవాలన్నారు.

వైష్ణవి టవర్స్ బీ బ్లాక్ నూతన కార్యవర్గం

నిర్మల్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వైష్ణవి టవర్స్ బీ బ్లాక్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. అధ్యక్షులుగా లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా రాఘవేందర్ రెడ్డి, కోశాధికారిగా వెంకటేష్ గౌడ్, ఫ్లోర్ లీడర్లుగా భాస్కర్, నారాయణరెడ్డి, హనుమ గౌడ్, విజయానంద్, కృష్ణారెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

ఉట్నూర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): భారత దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఆదివారం మండలంలోని హస్నాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నెదునూరి అశోక్, షేక్ జావిద్, అయ్యుబ్‌ఖైలాస్, ఇర్షద్, తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉంది'

జైనథ్, జూలై 27(ఆంధ్రజ్యోతి): దేశంలో కేంద్రంలో అధికారంలో ఉన్న పీఎం నరేంద్రమోదీ బీజేపీ ప్రభుత్వ అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని బీజేపీ బోరజ్ మండల పార్టీ అధ్యక్షుడు గాజుల సన్ని అన్నారు. ఆదివారం బోరజ్ మండలంలోని గిమ్మ(కె) గ్రామంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ ఎమ్మెల్యే కోటకింద మంజూరు అయిన ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికను బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే కోట కింద 874 ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. గిమ్మమాజీ ఉపసర్పంచ్ నీలం శ్రీకాంత్, బీజేపీ నాయకులు సాదలి శివ్వన్న, శ్రీరాం మురళీ, మంద రాజు, మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌కు తరలిన నాయకులు

బోథ్, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాజు గోండు సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మాజీ ఎంపీ సోఎం బాబురావు ప్రమాణ స్వీకారానికి మండలం నుంచి ఆయన అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఆదివారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారీగా తరలి వెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి దాదాపు 30 వాహనాలలో కార్యక్రమానికి తరలి వెళ్లడం జరిగింది.

ఆలయాన్ని దర్శించుకున్న మాజీ మంత్రి

ఆదిలాబాద్ టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోని అతిపురాతన రాంటెక్ ఆలయాన్ని మాజీ మంత్రి జోగు రామన్న సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం ఆలయ ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనాలను స్వీక రించి అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు భోజనం వడ్డించారు. ఆలయాన్ని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. శ్రీరాముడి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు.

తండాను గ్రామంగా మార్చినందుకు సన్మానం

ఉట్నూర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమల్‌తండా గ్రామాన్ని పూర్వపు సాకెర(జె) గ్రామంగా మార్చడానికి కృషి చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను సాకెర(జె) గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో గ్రామస్థులదందరు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించడంతో పాటు తమ గ్రామాన్ని సందర్శించి గ్రామ సమస్యలు కూడా పరిష్కరించాలని కోరారు.తమ గ్రామం పేరు మార్చడానికి అసెంబ్లీలో మా గురించి మాట్లాడి మా గ్రామానికి పాత పేరు సాకెరజెగా మార్చడమైందని కోరుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చవాన్ శేషరావు, రాథోడ్ ఉత్తంనాయక్, ప్రకాష్‌రాథోడ్, డిప్యూటీ ఈఈ రమేష్, రాథోడ్ గోకుల్, పవార్‌సురేష్, రాథోడ్ రాజేశ్వర్, రవీందర్ అశోక్, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ను సన్మానిస్తున్న సాకెర(జె) గ్రామస్థులు



సర్వేయర్ల పరీక్ష నిర్వహణ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా



మావలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తూ..

ప్రశాంతంగా ల్యాండ్ సర్వేయర్ల అర్హత పరీక్ష

ఆదిలాబాద్ టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన లైసెన్స్ ల్యాండ్ సర్వేయర్ ల అర్హత పరీక్ష ప్రశాంతంగా సాగింది. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు థియరీ, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు ప్లాటింగ్ పరీక్ష జరిగింది. భూ భారతి చట్టం అమలులో భాగంగా భూ కొలతలు, సర్వే చేసేందుకు లైసెన్స్ సర్వేయర్ల కోసం పరీక్షా జరిపారు. తొలి విడత కింద ఎంపికైన 155 మందికి మే 26 నుంచి జూలై 26 వరకు శిక్షణ సైతం ఇచ్చారు. కాగ.. పరీక్షకు 129 మంది హాజరు కాగా 26 మంది గైర్హజరైనట్లు అధికారులు తెలిపారు. నిర్దేశిత సమయం కంటే అరగంట ముందుగానే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పూర్తి చర్యలు తీసుకున్నట్లు అబ్జర్వర్ రాజ లింగు తెలిపారు.

● **గ్రామ పాలన అధికారి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ**

మావల: గ్రామ పాలన అధికారుల నియామకం కోసం నిర్వహిస్తున్న పరీక్షలకు సంబంధించి ఆదివారం జిల్లా కేంద్రంలోని నలంద కాలేజీలో ఏర్పాటు చేసిన గ్రామ పాలన అధికారుల నియామక పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి, అభ్యర్థుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారకు. ఉద యం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 51 మంది అభ్యర్థులకు గాను 48 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజర్ అయినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, తహసీల్దార్ శ్రీనివాస్, డిటీ ఇన్చార్, చీఫ్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్, తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే అనిల్

నేరడిగొండ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆలయాలయ అభివృద్ధికి ఎల్లవేళలా సహాయ సహకారం ఎప్పుడు ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని నారాయణ్‌పూర్ గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా హనుమాన్ మందిర ప్రహరీ ర్మాణానికి భూమిపూజ చేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గల ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కరమే ధ్యేయంగా కృషి చేస్తున్నానని ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టి కి తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, జాదవ్ గణేష్, గులాబ్ సింగ్, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● **గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి**

నేరడిగొండ: నియోజకవర్గంలో గల గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిస్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే నివాసంలో మండలంలోని కుమారి గ్రామస్థులు, భీంపూర్ మండలంలోని గుంజాల, గొల్లగాట్ గ్రామస్తులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని అన్నారు.

ఉత్తమ విద్యార్థులకు పురస్కారం

బోథ్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచిన వారికి ఆదివారం వినాయక రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరుగురు మంది విద్యార్థులకు రూ.8 వేల చొప్పున నగదు అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ శ్యామ్ రావు రిటైర్డ్ జడ్జి మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా ఈ పురస్కారాలను తన మనవరాలు శివాని సహకారంతో ఆర్థిక సహాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ రామన్ రావు దేశ్పాండే, కార్యదర్శి అంబాదాస్ ట్రస్టు సభ్యులు, పలువురు న్యాయవాదులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతగూడ రోడ్డు గండికి మరమ్మతులు

ఉట్నూర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరుగూడ నుంచి చింతగూడ చెరువు మీదుగా నిర్మిస్తున్న రోడ్డుకు గండిపడడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు సందర్శించారు. రోడ్డుకు గండిపడ్డ సమాచారం తెలియడంతో చెరువు పై నిర్మిస్తున్న రోడ్డును పరిశీలించిన అనంతరం వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించడంతో కాంట్రాక్టర్ యుద్ధ ప్రాతిపదికన జేసీబీ పెట్టి గండికి మరమ్మతులు చేయించారు.

'ఉద్యమాల ద్వారా సమస్యల పరిష్కారం'

ఉట్నూర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉద్యమాల ద్వారానే ప్రజల మౌళిక సమస్యలు పరిష్కారం అవుతాయని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వెంకటాద్రి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎన్ మిని ఫంక్షన్ హాల్‌లో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్‌రాందాస్ అధ్యక్షతన నిర్వహించిన భారత విప్లవపంథ నిర్మాతలు దేవులపల్లి వెంకటేశ్వరరావు తరిమెల నాగిరెడ్డి శిష్ట విజయ్‌శర్మల సంస్మరణ సభలో పాల్గొని మాట్లాడారు. ఇందులో గ్రామీణ పేదల సంఘం కొమురంభీం జిల్లా మంచిర్యాల, జిల్లా, నిర్మల్ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు దారంగుల ఎల్లయ్య, ఎనుముల నరసయ్య, బోద కిషన్, వాఘ్మారే సంబాజి, సిడం ధర్మ, రాజమౌళి, మహిళ సంఘం నాయకురాలు వనిత, జాదవ్ గణేష్, మహరాజ్, తదితరులు ప్రజలుపాల్గొన్నారు.

మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నేతలు

ఇంద్రవెల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు వీక్షించారు. ప్రత్యేకంగా బీజేపీ నేత ఇంటి వద్ద టీవీని ఏర్పాటు చేసి ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన సందేశాలను విన్నారు. ఈ సందర్భంగా ఖానాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ ఆరేల్లి రాజలింగం మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోవా రాజేశ్వర్, జిల్లా స్వచ్ఛ భారత్ కన్వీనర్ దీపిక్‌సింగ్ శేకవత్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దేవపూజ్ మారుతి, ఆడావ్ చంపత్ రావు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాథోడ్ భీంరావ్, నాయకులు మోరే దిలిప్, మాస్కే రాజవర్దన్, తదితరులున్నారు.



● లక్కారం గ్రామంలో 'మన ఊరు-మన బడి' పథకం కింద నిర్మాణం పూర్తయిన పాఠశాల భవనం

పేరు మారింది.. కన్నీరు మిగిలింది!

(5వ పేజీ తరువాయి...)

స్థానంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పథకం పేరు మార్చి అమ్మ ఆదర్శ పాఠశాలలుగా కొత్త నిధులు కేటాయిస్తూ కొత్త పనులు చేపట్టింది. దీంతో 'మన ఊరు-మన బడి' పథకం ద్వారా 237 పాఠశాలల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ఎట్టకేలకు పనులు పూర్తి చేసినా.. ఇంకా బిల్లులు అందక పోతుండడంతో వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనంపై అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా మంజూరైన కొత్త పనులు నిర్మిస్తున్నారు. 'మన ఊరు -మన బడి' పథకం పనులు చేసిన కాంట్రాక్టర్ కృష్ణకు ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇంకా రూ.40 లక్షల వరకు రావాల్సి ఉంది. అంతేకాకుండా లక్కారంలో ఉన్నత పాఠశాల నిర్మించిన కాంట్రాక్టర్ జావిద్‌కు సైతం లక్షలాది రూపాయలు రావాల్సి ఉంది. హస్నాపూర్‌లో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ కాంబ్లె రవికి సైతం డబ్బులు రావాల్సి ఉందని పలువురు కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

ఇంద్రవెల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మద్యం తాగుడికి బానిసై ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని కొబ్బయ్‌గూడలో జరిగింది. ఎస్సై ఇసాయన్న, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని కొబ్బయ్‌గూడ గ్రామంలో నివాసముంటున్న గౌలి మారుతి(39) గత కొన్ని సంవత్సరాల నుంచి తాగుడికి బానిసయ్యాడు. ప్రతిరోజు కూలీ పనులు చేసి వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. తాగిన మైకంలో భార్య పిల్లలను పట్టించుకోకపోవడంతో గత నాలుగేళ్ల క్రితం భార్య శోభాబాయి తన ముగ్గురు ఆడ పిల్లలతో పుట్టింటికి వెళ్లి ఇచ్చోడ మండల కేంద్రంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనులు చేసి పిల్లలను చదివిస్తుంది. శనివారం ఉదయం తాగిన మత్తులో ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మారుతి పనికి రాకపోవడంతో తోటి కూలీలు ఇంటికి వెళ్లి చూడగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించి పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు.

● **పురుగుల మందు తాగి మరొకరు..**

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన బొప్పారపు అశోక్ (37) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ.. ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ సంజయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత కొంత కాలంగా బొప్పారావు అశోక్ కడుపు నొప్పితో బాధపడుతున్నాడని, ఆ బాధ భరించలేక తీవ్ర మన స్థాపానికి లోనై క్షణికావేశంలో ఈనెల 15న పురుగుల మందు తాగాడన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు హుటాహుటిన స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్ళి అక్కడి వైద్యుల సలహా మేరకు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ మూడు రోజుల పాటు చికిత్స అందించగా ఆరోగ్యం మెరుగు పడక పోవడంతో మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఝురి(బీ) గ్రామస్థుల రాస్తారోకో

తానూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఝురి(బీ) గ్రామానికి బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని బేల్‌తరోడా గ్రామ జాతీయ రహదారిపై గ్రామస్తులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో భాగంగా దాదాపు రెండు గంటల పాటు రాస్తారోకో చేయడం జరిగింది. అనంతరం అక్కడ వాహనాల రాకపోకలు నిలిచి పోవడంతో వాహనదారులు ప్రజలకు అంతరాయం కలిగింది. రాస్తారోకో విషయం తెలుసుకున్న ముధోల్ సీఐ మల్లేష్, ఎస్సై షేక్ జుబేర్ స్థానిక మండల గిర్దావార్ నరేష్ వచ్చి గ్రామస్తులను సముదాయించి రాస్తారోకోను విరమించారు. భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డికి స్థానిక తహసీల్దార్ మహేందర్ నాథ్ ఫోన్లో రాస్తారోకో బ్రిడ్జి విషయమై సమాచారం అందించగా, ఝురి(బీ) గ్రామానికి చేరుకొని గ్రామస్తుల ద్వారా బ్రిడ్జి సమస్యను తెలుసుకొని పరిశీలించారు. త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టే విధంగా పై అధికారులకు నివేదికలను పంపించి బ్రిడ్జి నిర్మాణం కొరకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మాధవ్ బాలాజీపటేల్, గైక్వాడ్ సాయినాథ్, గజ్జు పాశమియా, రాములు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహా ప్రతిష్ఠాపన మహోత్సవాలు

కుంటాల, జూలై27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబకంటి గ్రామంలో సోమవారం నుంచి బుధవారం వరకు శ్రీ శివపరివార స్థిర ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని, స్థానిక వేదపండితులు భగవాన్ మహారాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగుతాయని, సోమవారం ఉదయం దేవతామూర్తుల ఊరేగింపు, వేద పండితుల పుణ్యాహవచనము, మండప ప్రవేశము, రక్షాబంధనం, షోడష మాతృక ఆరాధన, నవగ్రహ ఆరాధన, వాస్తుపూజ, యోగిని మండళారాధన, మహాభద్ర మండలారాధన, క్షేత్రపాలక ఆరాధన, అగ్నిప్రతిష్ఠ, గణపతి హోమం, నవగ్రహ హోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా దీక్షా కళాశాల ఫ్రెషర్స్‌డే

నిర్మల్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దీక్షా జూనియర్ కళాశాల 'ఆరంభం' పేరుతో నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఉత్సాహంగా సాగింది. ముఖ్యఅతిథిగా కళాశాల డైరెక్టర్ శంకర్ హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించారు. కార్యక్రమం ప్రమోద్ రావు (కరస్పాండెంట్) చేత దీపప్రజ్వలన, సరస్వతి పూజతో ప్రారంభమైంది. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ చెన్నాడి వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో కష్టపడితే ఏ లక్ష్యానికైనా చేరుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు



భారీ వరానికి జలమయమైన పంటచేలు



వర్షానికి భైంసాలో దెబ్బతిన్న పంట పైర్లు

• **దెబ్బతింటున్న పంటల పైర్లు**

భైంసా, జూలై 27 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఇక్కడి పలుప్రాంతాల్లోని పంటచేలు జలమయమయ్యాయి. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన పరిస్థితి అధికంగా ఉంది. ఎగువ ప్రాంతాల్లోని పంట చేల నుంచి దిగువ ప్రాంతాల్లో పంటల చేల వైపు వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. వర్షపు నీరు ఉధృతితో ప్రవహిస్తుండటం మూలంగా లోతట్టు ప్రాంతాల్లోని పంటల పైర్లు దెబ్బతింటున్నాయి. అంతేకాకుండా అధిక సమయం పంటచేలలో వర్షపు నీరు నిలిచి ఉండటం మూలంగా సంబంధిత పంటల పైర్లు దెబ్బతింటున్నాయి.

• **డివిజన్‌లో 50 మి.మీ. వర్షపాతం నమోదు**

ఇక్కడి డివిజన్ పరిధిలో ఆదివారం 50 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. లోకేశ్వరం మండల పరిధిలో 64.2 మి.మీటర్లు, ముథోల్ మండలంలో 62.4 మి.మీటర్లు, కుంటాల మండలంలో 58.2 మి.మీటర్లు, భైంసా మండలంలో 49.2 మి.మీటర్లు, బాసర మండలంలో 44 మి.మీటర్లు, తానూర్ మండలంలో 43.6 మి.మీటర్లు, కుబీర్ మండలంలో 28.4 మి.మీటర్లు వర్షం కురిసింది.

పీఆర్‌టీయూ కృషితోనే ఉపాధ్యాయులకు పదోన్నతులు

భైంసా, జూలై 27 (ఆంధ్రజ్యోతి): యూనియన్ ప్రతినిధుల కృషి ఫలితంగానే ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియకు సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ ఆమోద ముద్ర వేసిందని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేంద్రబాబు, బీ.వీ. రమణారావ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతకాలంగా పీఆర్‌టీయూ టీఎస్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి సారథ్యంలో యూనియన్ ప్రతినిధుల బృందం సీఎం రేవంత్ రెడ్డితో పాటు అధికారుల బృందాన్ని పలుమార్లు కలిసి సంబంధిత విషయంలో ప్రాతినిధ్యం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి పదోన్నతులకు పచ్చజెండా ఊపిందని, తద్వారా ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరనుందని తెలిపారు. దాదాపు 900 పైగా గెజిటెట్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ కానున్నాయని పేర్కొన్నారు.

భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

తానూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా మూడు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మిషన్‌భగీరథ ఏఈఈ పృథ్వీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోల్సా పంప్ హౌజ్ పరిధిలో పంప్‌హౌజ్ మిషన్ వద్ద ట్రాన్స్ ఫార్మర్ సమస్య కారణంగా అంతరాయం కలుగుతుందని, మండల వాసులు సహకరించాలని కోరారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నిర్మల్‌రూరల్, జూలై27 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఎల్లపెల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బొజ్జ రవి (45) తన పెద్దకొడుకు ఏ పనీ చేయడం లేదని గొడవ పడి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. భార్య పిల్లలు అందరూ బయటకు వెళ్లిన సమయంలో తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

నర్సాపూర్(జి), జూలై27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని టెంబుర్నిలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కోసరి గంగయ్య (46) తన కిరాణాషాపును తెరిచి లోపల శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు ఫ్రిజ్ కరెంటు తీగతగిలి తీవ్రమైన విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. స్థానికులు వెంటనే గంగయ్యను 108 అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్ పరీక్షించగా గంగయ్య అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై మృతుడు గంగయ్య భార్య కోసరి వనజ నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై గణేష్ విచారణ చేపట్టారు.

పునరావాసం కల్పించండి

• **మాజీ ఎమ్మెల్యేకు గుండేగాం గ్రామస్థుల వినతి**



బోస్లే నారాయణరావ్ పాటిల్‌ను కలిసిన గ్రామవాసులు

భైంసా, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పల్సికర్ ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ముంపునకు గురవుతున్న తమకు కాలయాపనకు తావులేకుండా పూర్తిస్థాయి పునరావాసం కల్పించాలని గుండేగాం గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్‌కు విజ్ఞప్తిచేశారు. గ్రామస్థులు ఆదివారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పాటిల్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఏళ్ల తరబడి తమ సమస్యలు హామీలకే పరిమితమవుతున్నాయి తప్ప ఆచరణకు నోచుకోవడం లేదని గ్రామస్థులు మాజీ ఎమ్మెల్యే ముందు వాపోయారు. ముంపు బెడదతో గ్రామస్థులమంతా చెట్టుకొకరు, పుట్టకొకరు విడిపోయి ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థులకు నష్టపరిహారంతో పాటు కేటాయించిన స్థలాలలో శాశ్వత గృహ నిర్మాణాలు చేపట్టి పూర్తిస్థాయి పునరావాసం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ సంబంధిత సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసువెళ్తానని వెల్లడించారు.



ప్రశిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ జీ

'దేశరక్షణ కోసమే భారతీయ జనతా పార్టీ'

నిర్మల్‌టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భారతదేశ రక్షణ కోసమే భారతీయ జనతా పార్టీ ఉందని రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ జీ అన్నారు. జిల్లాకేంద్రమైన నిర్మల్‌లో ఆదివారం నిర్వహించిన బీజేపీ ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్మల్ డివిజన్, మండల అధ్యక్షులకు ప్రశిక్షణ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సైద్ధాంతిక సాధికారత, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడానికి చేపట్టవలసిన ప్రణాళికలను వివరించారు. పార్టీ సిద్ధాంతాలు దేశంలోని తాజా రాజకీయాలు, సమకాలీన అంశాలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆర్మూల్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ, బీజేపీరాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రదీప్‌రావు పాల్గొన్నారు.

గజ్జలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

కుంటాల, జూలై 27(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మొదటి ఆదివారం పురస్కరించుకొని మండల కేంద్రం కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయానికి భక్తజనం పోటెత్తింది. ఉదయం నుండే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు త్రాగునీటితో పాటు అన్ని సౌకర్యాలు నిర్వాహకులు కల్పించారు.

ముథోల్‌లో భారీ వర్షం

• **లోతట్టు ప్రాంతంలో చేరిన నీరు**

• **ముథోల్‌లో 62.4 మల్లీమీటర్ల వర్షపాతం నమోదు**

ముథోల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం నీటితో పంటలు మునిగాయి. మొన్నటివరకు వర్షం కోసం ఎదురుచూసిన రైతులు వర్షాలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో వరినాట్ల పనులు జోరందుకున్నాయి. ముథోల్‌లో ఆదివారం 62.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోగా వాగులు పొంగిపొర్లుతున్నాయి.



వర్షం నీరులో పొలాలు



కుమ్రంభీం ప్రాంగణంలోకి వస్తున్న సీఆర్టీ అభ్యర్థులు

ప్రశాంతంగా ముగిసిన సీఆర్టీ పరీక్ష

● పరీక్ష కేంద్రాలు తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ, సబ్ కలెక్టర్లు

ఉట్నూర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్టీ)ల నియామకం కోసం ఆదివారం ఉట్నూర్ కొమురం భీం కాంప్లెక్స్‌లో నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా కాంప్లెక్స్ పరిధిలో ఏర్పాటు చేసిన తొమ్మిది సెంటర్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏకలవ్య గురుకుల పాఠశాల, బాలుర ఆశ్రమ పాఠశాల, బీఎడ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్లను సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా పరిశీలించడంతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ పరీక్ష నిర్వహణకు మొదటి నుంచి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 1గంట వరకు నిర్వహించిన పరీక్షకు 2651 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 2509మంది విద్యార్థులు హాజరు కాగా 142 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మొత్తం పరీక్షకు 94.64 శాతం హాజరు నమోదైందని తెలిపారు. పరీక్ష పకడ్బందీగా నిర్వహించడానికి తీసుకున్న చర్యలు సఫలమయ్యాయని అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసినట్లు తెలిపారు. అంతకు ముందు పరీక్ష కేంద్రాలకు వచ్చిన అభ్యర్థులను సిబ్బంది క్షుణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీడీ అంబాజీ,ప్రాజెక్టు హార్టికల్చర్ ఆఫీసర్ గడిమెల సందీప్‌కుమార్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



ఏకలవ్య గురుకుల పాఠశాల వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న పీవో ఖుష్బుగుప్తా

కళాశాలపై నిఘా నేత్రం

- కమాండ్ కంట్రోల్ సిస్టం ద్వారా నిర్వహణపై గట్టి పర్యవేక్షణ
- హాజరు శాతం పెంపు
- విద్యార్థుల భద్రత పై నిరంతర పర్యవేక్షణ
- కళాశాల నిర్వహణ పై నిఘా

బజార్‌హత్నూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై ఇంటర్ బోర్డు నిరంతర పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం బాగానే ఉన్నప్పటికీ విద్యార్థుల చదువులు కొంత వెనుకబాటుతనం ఉందని విశ్లేషకులు అంటున్నారు. కళాశాలల్లో విద్యార్థులు కేవలం పరీక్షలప్పుడే కనిపించడంతో హాజరు శాతం, ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఇంటర్ బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత శాతం పెంపుకు కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కళాశాల నిర్వహణ పై గట్టి నిఘా కోసం ప్రతి కళాశాలల్లో 12 నుంచి 15 వరకు సీసీ కెమెరాలను అమరుస్తున్నారు.

కమాండ్ కంట్రోల్ సిస్టం ద్వారా నిరంతర పర్యవేక్షణ

కళాశాలల్లో పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా సజావుగా సాగేందుకు ప్రత్యేకంగా సీసీ కెమెరాల ఏర్పాట్లు ఉండేవి. ఇక నుంచి ప్రతి కళాశాలలో విద్యార్థులు హాజరుతో పాటు అధ్యాపకుల పని తీరు, కళాశాలలో ఏం జరుగుతుందో ఈ కమాండ్ కంట్రోల్ సిస్టం ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండబోతుంది. కళాశాలకు వచ్చి పోయేవారు, విద్యార్థుల క్లాస్‌లో వారి కదలికలు, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకుల రోజు వారీ పనితీరును ఎప్పటికప్పుడు నేరుగా తెలుసకుంటారు. కళాశాలల వారీగా ఎప్పటికప్పుడు రోజు హాజరు విద్యార్థుల శాతం పరిశీలిస్తారు. అదేవిధంగా కళాశాల పని తీరు, బోధన, భద్రతలను తెలిసేలా ఇంటర్ బోర్డుకు అనుసంధానం చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు అధికారులు నేరుగా పర్యవేక్షణ ఉంటుంది.



బజార్‌హత్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ కముల సునీల్

పర్యవేక్షణతో భద్రత భావం...

నిరంతర పర్యవేక్షణతో భద్రత భావం, విద్యార్థుల్లో క్రమశిక్షణ, బాధ్యత, వారి భద్రత కూడా మెరుగు పడుతు మార్పు ప్రారంభమవుతుంది. ఇప్పటికే కళాశాలలో ఆరోగ్య కళాశాలలో భాగంగా అంటి డ్రగ్స్‌ఒత్తిడికి గురికాకుండా, సృజనాత్మక విషయాలను క్లాస్‌రూంలో వివరిస్తున్నారు.క్షణకావేశానికి లోనుకాకుండా సమయాను సారంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. మరింతగా బోధన మెరుగుపడే అవకాశాలు ఉంటాయని అధ్యాపకులు ఆశాభావం వ్యక్త పరుస్తున్నారు.

కళాశాల మెరుగుదలకు ఎంతో దోహదం..

- కములు సునీల్, ప్రిన్సిపాల్ బజార్‌హత్నూర్

కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం మెరుగు పడుతుంది.కళాశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పారదర్శకతకు ఎంతగానో దోహద పడుతుంది. ఈ కెమెరాల సహాయంతో ఇక్కడేమి జరుగుతుందో పసిగట్టి వెంటనే చర్యలు చేపట్టే వీలుంటుంది.

రోడ్డు ఇలా.. నడిచేదెలా?

ఇంద్రవెల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భీంనగర్ కాలనీలో రోడ్డు వర్షపు నీటితో బురదమయమై చిత్తడిగా మారింది. రోడ్డంతా గుంతలుగా ఏర్పడి బురదగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర సరుకులు తీసుకురావడానికి బయటకు రావాలంటే భయపడుతున్నారు. దీంతో చిన్నపాటి వర్షానికే రోడ్డు ఇలా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



భీంనగర్ కాలనీలో బురదగా మారిన రోడ్డు

కురిసింది తక్కువ.. అవస్థలు ఎక్కువ

ఇచ్చోడ, జులై, 27 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు సతమతమవుతున్నారే తప్పా చెరువు, కుంటల్లోకి పెద్దగా వరద రాలేదు. రోజంతా ముసురుతో చిరు వ్యాపారులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. కాలనీల అంతర్గత రహదారులు ధ్వంసమయ్యాయి. వాహనాల రాకపోకలతో రోడ్లపై గుంతలు పడ్డాయి. ఈ వర్షాలతో ప్రయోజనం కంటే అవస్థలే అధికంగా మారాయి.



ఇచ్చోడలో ఆసుపత్రి ఆవరణ వద్ద గుంతల మయంగా మారిన రహదారి

నాడు వెలవెల.. నేడు కళ కళ

ముథోల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ప్రారంభమైన నెల రోజులు సైతం ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో చెరువులన్నీ ఎండు ముఖం పట్టి విలవిల లాడాయి. అయితే గత మూడు రోజుల నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల కారణంగా చెరువులు ఇప్పుడిప్పుడే నీటి కళతో సంతరించుకొని కళకళలాడుతున్నాయి. మండలంలోని చించాల గ్రామంలో గల పెద్ద చెరువు మొన్నటి వరకు నీరు లేక వెలవెలబోయిన చెరువు గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షం కారణంగా ఈ చెరువు జలకళతో ఉట్టిపడుతుంది.



మొన్నటి వరకు నీరు లేని చించాల పెద్ద చెరువు



నేడు కురుస్తున్న వర్షాల కారణంగా జలకళతో చించాల పెద్ద చెరువు

మంచమే వారికి అంబులెన్స్

● అత్యవసర సమయంలో మంచంపై రోగుల తరలింపు

● గోస పడుతున్న ఆదివాసీ గిరిజన గ్రామం

● రోడ్డు సౌకర్యాన్ని కల్పించకుంటే స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తామని ఏకగ్రీవ తీర్మానం

తలమడుగు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటి శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకొని అంతరిక్షంలో ప్రయాణిస్తున్నప్పటి కీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆదివాసి గిరిజనులకు దారి కష్టాలు తప్పడం లేదు. అత్యవసర ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేని దినాస్థితిలో తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని రత్నాపూర్ ఆదివాసి గిరిజనుల కష్టాలు రహదారిని నిర్మించకుంటే త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికలను మూకుమ్మడిగా బహిష్కరిస్తామని ఆదివాసి గిరిజన గ్రామస్తులు తీర్మానం చేపట్టారు. వివరాలకు వెళితే ఆదిలాబాద్ జిల్లాలోని తలమడుగు మండలం రత్నపూర్ గ్రామస్థులకు కనీసం రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో దాదాపు 500 మంది జనాబా ఉన్నప్పటికీ వారి సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎవరు పట్టించుకోవడంలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రత్నపూర్ గ్రామానికి నాలుగేళ్ల క్రితం రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం నాలుగు కోట్ల రూపాయలను మంజూరు చేసినప్పటికీ రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ప్రారంబించి మధ్యలోనే వదిలి వేయడంతో రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని పలుమార్లు గ్రామస్తులు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామానికి 108 అంబులెన్స్ వాహనం రావడం లేదన్నారు. ఎవరికైనా వ్యాధుల సంక్రమిస్తే మంచం పైనే దాదాపు మూడు కిలోమీటర్ల వరకు తీసుకొని వెళ్లవలసిన పరిస్థితిలు ఏర్పడుతున్నాయన్నారు. గ్రామానికి వైద్య సిబ్బంది సక్రమంగా రావడం లేదన్నారు. కాగా గ్రామస్తులంతా కలిసి శనివారం గ్రామ పెద్ద ఆధ్వర్యంలో గ్రామ సభ ఏర్పాటు చేసుకొని త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికలను మూకుమ్మడిగా బహిష్కరిస్తామని తీర్మానం చేపట్టారు. ఇకనైనా అధికారు లు స్పందించి రత్నాపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇందులో గ్రామ పటేల్, నాగోరావ్ పటేల్, గట్టియల్ ప్రసాద్, మహజన్ కోశేరావ్, తెలంగారావు, యూత్ నాయకులు శ్రీనివాస్ దేవరావు పాల్గొన్నారు.



రత్నపూర్ గ్రామంలో రోగిని మంచంపై కొండ కిందకి దించుతున్న ఆదివాసీలు



రత్నాపూర్ రోడ్డు దుస్థితి

సన్నగిల్లుతున్న అన్నదాత ఆత్మ నిబ్బరం

- నిర్మల్ జిల్లాలో పెరుగుతున్న రైతు ఆత్మహత్యలు
- పంట దిగుబడి రాక కొందరు
- చేసిన అప్పులు తీర్చలేమని మరి కొందరు
- ధైర్యం కోల్పోతూ ప్రాణాలు వదులుతున్న వైనం
- వారం రోజుల్లో జిల్లాలో ఇద్దరు రైతుల ఆత్మహత్య
- ఈ ఏడాది ఆరంభం నుంచి అసువులు బాసిన ఏడుగురు రైతులు

ఖానాపూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను తట్టుకొని నిలబడడంలో కొంత మంది రైతన్నలు విఫలమై అర్ధాంతరంగా తనువులు చాలిస్తున్న ఘటనలు ఇటీవల కాలంలో తరచుగా చోటుచేసుకుంటున్నాయి. దేశానికి అన్నం పెట్టే రైతన్నల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వాలు ఎన్నో పథకాలను తెస్తున్నప్పటికీ అవి క్షేత్రస్థాయిలో సత్ఫలితాలని ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకునేందుకు అందిస్తున్న పెట్టుబడి సహాయం లాంటివి అన్నదాత కష్టాలను తీర్చేడంలో కేవలం కంటి తుడుపు చర్యలుగా మాత్రమే మిగిలి పోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ రంగంలో గతంలో అందించిన ఎన్నో రకాల రాయితీలను ఎత్తి వేయడంతో రైతన్నపై అదనపు భారాన్ని మోపినట్లేనని పలువురు చెబుతున్నా రు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని ఎన్నో ఏళ్లగా ఓవైపు రైతు సంఘాలు పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు మాత్రం ఆ దిశగా ముందడుగు వేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నా యి. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల సన్న రకం ధాన్యానికి బోనస్ ప్రకటించినప్పటికీ మిగతా పంటల విషయంలో గిట్టుబాటు ధర దక్కడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పంట దిగుబడి రాక కొంతమంది, వ్యవసాయ అవసరాలకు, కుటుంబ అవసరాల కోసం తెచ్చిన అప్పులను తీర్చలేమేమోననే ఆందోళనలతో మరికొంత మంది రైతన్నలు అర్ధాంతరంగా తనువును చాలిస్తున్నారు. ఈ ఏడాది ఆరంబం నుండి ఇప్పటి వర కు నిర్మల్ జిల్లాలో ఏడుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం కలకలం సృష్టిస్తోంది.



సుర్జాపూర్ గ్రామంలో గుంజకు ఉరేసుకున్న రైతు (ఫైల్)

సన్నగిల్లుతున్న ఆత్మ నిబ్బరం..

ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంటలు పండించే రైతన్న తాను వేసుకున్న పంటలకు ఏ నష్టం వచ్చిన ఆత్మ నిబ్బరాన్ని కోల్పోతున్నట్లు కనిపిస్తోంది. నేటి పోటీ ప్రపంచంలో ఖర్చులు పెరిగిపోవడంతో వ్యవసాయ అవసరాలకు, కుటుంబ అవసరాల కోసం రైతులు అప్పులు చేయక తప్పని పరిస్థితి తలెత్తుతోంది. వ్యవసాయంలో నానాటికి పెట్టుబడి ఖర్చులు పెరుగుతూ పంట దిగుబడితో వచ్చే ఆదాయం తగ్గిపోవడంతో వ్యవ సాయాన్ని జీవనాధారంగా బ్రతుకుతున్న రైతు ల్లో చేసిన అప్పులు తీర్చలేమేమోనని ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఆందోళనకు తోడు అ యితే అతివృష్టి లేదా అనావృష్టి అన్నట్లుగా ప్రకృ తి సృష్టిస్తున్న బీభత్సాలు అన్నదాత మదిలో మరిం త ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. దీంతో క్రమేపి మన ధైర్యం సన్న గిల్లుతోందని చెబుతున్నారు.



ఆత్మహత్య చేసుకున్న రైతు రాములు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాహుల్ గైర్వాడ్ (ఫైల్)

ఏడు నెలల కాలంలో ఏడుగురు అన్నదాతల ఆత్మహత్య..

నిర్మల్ జిల్లాలో 2025 ఆరంభం నుండి జూలై 26వ తేదీ వరకు ఏడుగురు అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు చెబుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీన భైంసా మండంలోని కామోల్ గ్రామానికి చెందిన హంపోలి ప్రభాకర్ రెడ్డి (42) అనే రైతు అప్పుల బాధతో ఉరి పెట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫిబ్రవరి 25వ తేదీన దస్తురాబాద్ మండలం గొడిసిర్యాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోండుగూడలో నామెల్లిపురక జగన్(45) అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మార్చి 8వ తేదీన నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన నీరటి గంగాధర్(44) అనే రైతు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మే 5వ తేదీన భైంసా మండలం గుండెగావ్ గ్రామానికి చెందిన సూర్యవంశీ ప్రసాద్(49) అప్పుల వాళ్ల వేధింపులకు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. మే 11వ తేదీన భైంసా మండలం వటోలి గ్రామానికి చెందిన జాదవ్ వినోద్(39) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 21వ తేదీన దిలావర్‌పూర్ మండలం మాయాపూర్ గ్రామానికి చెందిన కామిండ్ల భీమన్న(47) అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 26న ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన సంఘ రాములు (65) అనే రైతు తన వ్యవసాయ క్షేత్రంలో మంచె గుంజకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక జూలై మాసంలోనే వారం రోజుల వ్యవధిలో ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడడం కలకలం సృష్టిస్తోంది.

అన్నదాతల్లో మనోనిబ్బరం పెంపొందించడంపై కనిపించని భరోసా

జిల్లాలో వరుసగా రైతు ఆత్మహత్యలు నమోదు అవుతున్నప్పటికీ ఆత్మహత్యల నివారణపై చర్యలు చేపట్టడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో అన్నదాత్లో మనోధైర్యం నింపేలా అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలలో సైతం రైతులకు మరింత ప్రాధాన్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. వ్యవసాయంలో పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో ఉంచుకొని రైతులకు అందజేసే విత్తనాలు, ఎరువుల విషయంలో మరింత పారదర్శకత పాటిస్తూ రాయితీపై అందజేయాలని పలువురు కోరుతున్నారు. ఇతర ఆదాయ మార్గాలు లేకుండా కేవలం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు నిరంతరం ఆదాయం వచ్చేలా గొర్రెలు, మేకలు, పశువులు, కోళ్ల పెంపకంతో పాటు పడి పరిశ్రమ వైపు ప్రోత్సహించాలని కోరుతున్నారు. ఇలాంటి వాటిని రైతులకు రాయితీపై అందజేయడం ద్వారా భవిష్యత్తు పట్ల వారికి మరింత భరోసాను నింపి అప్పుల ఊబి నుంచి బయటపడే మార్గాలను చూపవచ్చని చెబుతున్నారు.

● ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాలి..

- సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు



రైతు ఆత్మహత్యలు తగ్గాలంటే ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాలి. వ్యవసాయ రంగం లో ఖర్చు పెరిగింది. పంట దిగుబడి తగ్గింది. దీంతో రైతులు అప్పులు చేయక తప్పని పరిస్థితి నెలకొంది. చేసిన అప్పులను తీర్చలేక కొంత మంది రైతులు మనోధైర్యం కోల్పోతున్నారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ప్రకటించిన 194 జీవో ప్రకారం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రైతు బీమాతో పాటు రూ. 6 లక్షల పరిహారం అందజేయాలి.

నడకే నరకప్రాయం

● అయినా తప్పని ప్రయాణం

ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనే కొన్ని చోట్ల ప్రధాన రహదారులు నడవడానికి కూడా వీలు లేకుండా మారగా గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత అధ్వాన్నకరంగా మారింది. ఇందుకు జైనథ్ మండలం ఆనందపూర్ వెళ్లే ప్రధాన రహదారి నిదర్శనంగా మారింది. మహారాష్ట్ర వైపు వెళ్లే ప్రధాన రహదారుల్లో ఒక్కటైన ఈ రోడ్డుపై ప్రస్తుతం నడవడానికి కూడా వీలు లేకుండా పోయింది. పెన్ గంగ నది గుండా ప్రమాదకరంగా ఉన్నలో లెవెల్ వంతెనపై నుండి ప్రయాణం చేయడమే ఓ సాహసమైతే... గుంతల రోడ్డుపై ప్రయాణించడం దుస్సహసంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఆంధ్రజ్యోతి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఫొటో న్యూస్



గుంతలమయంగా మారినఆనందపూర్ నుంచి మహారాష్ట్రకు వెళ్లే రహదారి



తెలంగాణ-మహారాష్ట్ర మధ్యలో ప్రమాదకరంగా లోలెవల్ బ్రిడ్జి





ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.3 కనిష్ఠం 23.2

ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

సోమవారం 28 జూలై 2025





ఉట్నూర్ పాఠశాలలో నిర్మించిన డార్మెటరీ



వ్యర్థాలతో తయారు చేసిన అందమైన బొమ్మతో పురపాలక అధికారులు

వ్యర్థాల నుంచి.. అద్భుతం దిశగా!

ఆదిలాబాద్ టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): పనికిరాని వస్తువులతో అందమైన కళాకృతులను రూపొందించడం కొందరికే సాధ్యం. పనికి రాకుండా పోయిన వాహనాల టైర్‌లు, ఇతరత్రా సామగ్రితో ఆకర్షించే బొమ్మను తయారు చేసి పురపాలక అధికారులు పట్టణంలోని కొమురం భీం చౌరస్తాలో ఏర్పాటు చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా వేస్ట్ టు వండర్ ఇన్నొవేట్‌ను పుర యంత్రాంగం అమలు చేసిన నేపథ్యంలో పాడయిపోయిన వస్తువుల నుంచి అందమైన బొమ్మను తయారు చేశారు. చూడగానే ఆకట్టుకునేలా, ప్రజలు సెల్ఫీలు దిగేలా బొమ్మను ఏర్పాటు చేసినట్లు సానిటరీ ఇన్స్‌పెక్టర్ బైరి శంకర్ తెలిపారు. ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ రవికిరణ్ పాల్గొన్నారు.

మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళశాలలో (2025-26) విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న ఎస్సీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.జె.అరుణ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 30లోగా పదోతరగతి, ఇంటర్ మెమోలు, టీసీ, బోనాఫైడ్, ఆధార్‌కార్డు, ఆధాయధృవీకరణ పత్రం, 5 పాస్‌ఫోటోలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, ఎంజడ్‌సీ, బీజడ్‌సీ, బీఏ, బీకాం (జనరల్), బీకాం (సీఏ) గ్రూపులలో ఎస్సీ మహిళ అభ్యర్థులకు సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం సెల్ నెం. 8790009838, 7396533849కు సంప్రదించాలని కోరారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలి : సాధన సమితి

ఉట్నూర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో నిరుద్యోగులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించడానికి స్పెషల్ ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని ఏజెన్సీ సాధన సమితి డిమాండ్ చేస్తుంది. ఏజెన్సీ ప్రాంతంలోని వేలాది మంది నిరుద్యోగులకు న్యాయం జరగాలన్న ఉద్దేశంతో ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగిస్తున్నామని ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ అధ్యక్షుడు సోమేష్‌కుమార్ దీపక్‌లు తెలిపారు. ట్రైబల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ)ను వెంటనే ఏర్పాటు చేయాలని, 5వ షెడ్యూల్ అండ్ ఆర్టికల్ 244 ప్రకారం తప్పనిసరిగా నియమకాలు చేపట్టాలని, గత 13 ఏళ్లుగా విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. వేలాది పోస్టులు ఖాళీ గా ఉన్నాయని ప్రతీ ఏజెన్సీ జిల్లాలో ప్రత్యేకంగా డీఎస్సీ నిర్వహించి స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఇది వరకు ప్రభుత్వం ద్వారా మంజూరైన 569 పోస్టులకు నియామకానికి కార్యచరణ చేయకపోతే గిరిజన సంక్షేమ శాఖ కమిషనరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.



విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కలిపిస్తున్న దృశ్యం

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన

భీంపూర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ డివిజన్ భీంపూర్ సెక్షన్‌లోని నిపాని గ్రామం పరిసరాల రైతుల పొలాల్లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎఈ తిరుపతిరెడ్డి రైతులకు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్షాకాలంలో పొలాల్లో కరెంటు వైర్లు తెగిపడినప్పుడు, కరెంటు స్తంబాలు వంగినపుడు, విద్యుత్ తీగలు, చెట్లు స్తంబాల వైర్లకు తగిలినా, ఇంట్లో, బయట పొలాల్లో, సపోర్ట్ వైర్లు తెగిపడిన వెంటనే సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. రైతులు 1912 లేదా తనకు తెలపాలని, కరెంటును పొదుపుగా వాడాలన్నారు. వ్యవసాయ మోటర్లకు విధిగా కెపాసిటర్లు వాడాలని ఇంట్లో ఐఎస్ఐ పరికరాలు, ఎల్ఈడీ బల్బులు వాడాలని అవగాహన కల్పించారు. ఇందులో రైతులు రామ్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి షేక్ నిఖిల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన సీఆర్టీ పరీక్ష

- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్లు

7 లో







పేరు మారింది.. కన్నీరు మిగిలింది!

- జిల్లాలో 'మన ఊరు-మన బడి' కింద ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ పనులు
- వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్న కాంట్రాక్టర్లు
- ఎట్టకేలకు పూర్తయిన పనులు.. అయినా రాని బిల్లులు
- పథకం పేరు మారడంతోనే అంటూ బాధితుల ఆవేదన
- జిల్లావ్యాప్తంగా ఈ పథకం ద్వారా 237 పాఠశాలలను గుర్తించి అధునాతన పనులు

ఉట్నూర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటు అయిన తెలంగాణ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ప్రభుత్వం అమలు చేసిన 'మన ఊరు-మన బడి' పథకం పేరును సీఎం రేవంత్ ప్రజాపాలన ప్రభుత్వం పథకం పేరును 'అమ్మ ఆదర్శ పాఠశాల' పథకంగా మార్చడంతో కాంట్రాక్టర్లకు కన్నీళ్లు మిగిలాయి. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు కన్నీరు మిగిల్చిందని వాపోతున్నారు. గతంలో ఉన్న తెలంగాణ ప్రభుత్వం 2021లో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడంతో పాటు అధునాతన హంగులు కల్పించాలని ప్రారంభించిన 'మన ఊరు-మన బడి' పథకం అమలు కోసం వంద కోట్ల రూపాయలు కేటాయించారు. ఆదిలాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాల నిర్మాణం కోసం ఈ పథకం ద్వారా నిధులు మంజూరు చేసి ప్రతీ ఊరిలో బడిగుడి బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందినట్లు అని భావించింది.

జిల్లాకు రూ.100 కోట్లు మంజూరు

జిల్లాలో అప్పుడు ఉన్న 18 మండలాల్లో 'మన ఊరు-మన బడి' పథకం ద్వారా పాఠశాలల మరమ్మతులు, నూతన భవనాల నిర్మాణం, విద్యుత్ పనులు, మరుగుదొడ్ల నిర్మాణాలు, ప్రహరీల నిర్మాణాలు, అదనపు గదులను నిర్మించడానికి ప్రభుత్వం జిల్లాకు రూ.వంద కోట్లు మంజూరు చేసింది. ఈ పథకం ద్వారా 237 పాఠశాలలను గుర్తించి పనులు చేయాలని జిల్లా అధికారులు భావించారు. ఆ రోజులలో అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు కొన్ని పనులను టెండర్లకు, మరికొన్ని పనులను అధికార పార్టీకి చెందిన నాయకులకు, కార్యకర్తలకు అప్పగించారు. పనులు తీసుకున్న నాయకులు కమీషన్‌పై కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. ఉట్నూర్ మండలంలో 23 పనుల కోసం రూ.5.83 కోట్లు మంజూరు కాగా.. ఉట్నూర్, హస్నాపూర్, కుమ్మరితండా, షాంపూర్, సాలెవాడ, లక్కారం, పెర్కాగూడం, ఉమ్రి, అందోళి, తాండ్ర, బాబాపూర్, పాత ఉట్నూర్, దంతన్‌పల్లి, గంగన్నపేట ప్రాథమిక పాఠశాలలు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలల పనుల కోసం రూ.5.83 కోట్లు మంజూరు అయ్యాయి. రెండేళ్ల క్రితం వరకు రూ.3.36 కోట్ల మేర పనులు పూర్తికాగా, ఇంద్రవెల్లి మండలంలో ఇంద్రవెల్లి, హీరాపూర్, గౌరాపూర్, దేవాపూర్, మామిడిగూడ, హర్కాపూర్, మర్కాగూడ, హీరాపూర్, ధనోరా, ముత్తునూరు, సర్వజీగూడ, అందునాయక్‌తండాలలో పాఠశాలల కోసం రూ.3.91 కోట్లు మంజూరు చేశారు. అయితే పనులన్నీ నత్తనడకన సాగించిన కాంట్రాక్టర్లు ఎట్టకేలకు పనులు పూర్తి చేశారు. గాదిగూడ, నార్నూర్, సిరికొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండ, గుడిహత్నూర్, ఆదిలాబాద్, తలమడుగు, తాంసి, భీంపూర్, మండలాల్లో మొత్తం 237 పాఠశాలల భవనాలు ఈ పథకం ద్వారా మంజూరు అయ్యాయి. 'మన ఊరు-మన బడి' పథకం ద్వారా ఉట్నూర్ మండలంలోని లక్కారం, ఉటూనర్, అందోలి, దంతనపల్లి పాఠశాలల పనులు పూర్తి చేసినప్పటికీ.. అక్కడక్కడ కొన్నికొన్ని పనులు అంతంత మాత్రంగానే జరిగినట్లు తెలుస్తుంది. వంట షెడ్లు నిర్మించినా.. ఫ్లోరింగ్ పనులు పూర్తిచేయక పోవడంతో మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

వడ్డీలు కట్టలేక కాంట్రాక్టర్ల ఇబ్బందులు

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'మన ఊరు-మన బడి' పథకం

(తరువాయి 6వ పేజీలో...)

ఇంకా బిల్లులు రావాల్సి ఉంది

: కృష్ణ, కాంట్రాక్టర్, ఉట్నూర్



గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రారంభించిన 'మన ఊరు-మన బడి' పథకం ద్వారా ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో నూతన పాఠశాల భవనాలు నిర్మించాం. ప్రభుత్వం మారడంతో పథకం పేరు మారింది. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్మాణాలకు నిధులు ఇచ్చిన ప్రభుత్వం.. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన 'మన ఊరు-మన బడి' పనులకు పూర్తి నిధులు ఇవ్వక పోవడంతో అప్పుల పాలయ్యాం.

డార్మెటరీ బిల్లు రావాల్సి ఉంది

: కాంబ్లె రవి, కాంట్రాక్టర్, హస్నాపూర్



ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం తినడానికి విద్యార్థుల కోసం డార్మెటరీ నిర్మాణం పూర్తి చేశాం. పనులు పూర్తి చేసి రెండేళ్లు కావొస్తున్న ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడం వల్ల చేసిన అప్పులకు వడ్డీ కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం.

ఇంకా కొన్ని పాఠశాలలకు బిల్లులు రావాల్సి ఉంది

: చౌహాన్ రమేష్, డీఈఈ, ఉట్నూర్



'మన ఊరు-మన బడి' పథకం ద్వారా పాఠశాలల భవనాలు, మరమ్మతుల పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇంకా కొన్నికొన్ని బిల్లు రావాల్సి ఉంది. అమ్మ ఆదర్శ పాఠశాలల బిల్లులు ముందుగా వస్తున్నాయి. త్వరలోనే 'మన ఊరు -మన బడి' పాఠశాలలకు నిధులు కూడా వస్తాయి.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్
- కలెక్టర్‌తో కలిసి గుడిహత్నూర్, బోథ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిశీలన

గుడిహత్నూర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచి కొరత లేకుండా చూడాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో సందర్శించారు. కార్యాలయంలో ఎరువులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి అమ్మకాల తీరును సంఘం సిఈఓ కేంద్రే పండరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాంలో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. సహకార సంఘం కార్యాలయంలో ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తెప్పించుకోని కొరత లేకుండా చర్యలో తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామీ, జిల్లా సహకార అధికారి మోహన్, పీఏసీఎస్ చైర్మన్ ముండే సంజీవ్, తహసీల్దార్ కవిత రెడ్డి, ఏఓ రమేష్, సహకార అధికారులు డి ఆత్మారం, నితిన్ కుమార్, జలాల్, బ్రాంచ్ మేనేజర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



గుడిహత్నూర్ సహకార సంఘం కార్యాలయంలో ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్, కలెక్టర్ రాజర్షిషా

● యూరియా తరలకుండా చెక్ పోస్టుల వద్ద నిఘా

బోథ్: మండల కేంద్రంలో ఆదివారం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్ పాటు కలెక్టర్ రాజర్షిషాలు ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మొదట సహకార సంఘం గోదాంలో యూరియా నిలువలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా అక్కడే ఉన్న సీఈఓ బోలిస్వామి సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్‌లను రైతులకు ఏ విధంగా యూరియా బస్తాలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రైతు పట్టాదారు పాస్ బుక్ తీసుకొని వస్తే ఎకరానికి రెండు యూరియా బస్తాలు ఇస్తున్నామని వారి వివరించారు. అనంతరం బోథ్ సివిల్ ఆసుపత్రిని సందర్శించారు. వారి వెంట ట్రైని కలెక్టర్ సలోని చాప్రా, ఆర్డీవో స్రవంతితో పాటు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు స్థానిక తహసిల్దార్ సుభాష్ చంద్ర, ఎంపీడీవో రమేష్, ఎస్సై శ్రీ సాయిలతో పాటు వ్యవసాయ అధికారి రవితేజ, తదితరులు పాల్గొన్నారు.



బోథ్ ఆసుపత్రిలో పాప ఆరోగ్యంపై కుటుంబీకులను అడిగి తెలుసుకుంటున్న ప్రత్యేక అధికారి, కలెక్టర్

చిన్నారి వ్యాధిపై అధికారుల ఆరా..

బోథ్: బోథ్ మండలంలో ఆదివారం ఆకస్మికంగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్, కలెక్టర్ రాజర్షిషాలు పర్యటించారు. అయితే బోథ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా అధికారులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారి ప్రాణాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో తీవ్రంగా స్పందించారు. పాపకు గల వ్యాధి ఏమిటని? ఆమెను ఎక్కడెక్కడ చూపించారని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత అక్కడే ఉన్న జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్‌ను పిలిచి పాప ఆరోగ్యంపై మాట్లాడారు. వెంటనే 108 వాహనాన్ని పిలిపించి ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి పంపించి ప్రత్యేక వైద్యం అందించాలని, హైదరాబాద్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని పలు సూచించారు. అయితే జిల్లా అధికారులు ఆకస్మికంగా పర్యటించడంతో పాపకు ఆశించిన స్థాయిలో వైద్యం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో అందింది పాప కోలుకోవడంతో ఇటు జిల్లా అధికారులు.. చిన్నారి కుటుంబ సభ్యులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దృష్టి సారించాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్

ఆదిలాబాద్ టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర అబ్కారీ కమిషనర్ సి.హరికిరణ్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ఆయన పాల్గొన్నారు. భారీ వర్షాలు, సీజనల్ వ్యాధులు, యూరియా, ఎరువుల నిల్వలపై అధికారులతో సమీక్షించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తక్షణమే స్పందించేలా ఎస్‌డీఆర్ ఎఫ్ బృందాలు, ఆయా శాఖలు సన్నద్ధమై ఉండలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని, ఆర్డీవో స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

● సమస్యలపై ఎక్సైజ్ కానిస్టేబుళ్ల వినతి

ఆదిలాబాద్ టౌన్: ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ జిల్లాలో పర్యటించిన నేపథ్యంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రం అందించి.. వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బిల్లులు, సీనియార్టీ లిస్టు ప్రమోషన్‌లు తదితర సమస్యలపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరగా... ఆయన సానుకూలంగా స్పందించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కానిస్టేబుల్ అసోసియేషన్ అధ్యక్షులు పోచన్న తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్, కార్యవర్గ సభ్యులు లత, మహేందర్, వెంకటగిరి పాల్గొన్నారు.

భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలి

- కోర్ట-చనకా బ్యారేజీని సందరించిన ఎస్పీ

జైనథ్, జూలై27 (ఆంధ్రజ్యోతి):ఆదిలాబాద్ జిల్లా భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆదివారం జైనథ్ ఉమ్మడి మండలంలోని సరిహద్దున గల కోరట చనకా బ్యారేజ్‌ను సందర్శించి ఈ సందర్భంగా పెన్‌గంగా నది ప్రవాహ పరిస్థితులను పరిశీలించారు. యువత చెడు వ్యసనాలను వీడి సన్మార్గం వైపు పయనించేలా మండలంలోని కోరట గిమ్మ, తర్నం మూడు గ్రామాల ప్రజలు యువతతో పోలీసులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువతకు స్పోర్ట్స్ కిట్‌లను ఎస్పీ అందజేశారు. పలు అంశాల పై ప్రజలకు మండల పోలీసులకు దిశా నిర్దేశం చేశారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, జైనథ్ రూరల్ సీఐ డి.సాయినాథ్, ఎస్ఐ గౌతమ్, తర్నం, గిమ్మ, కోరట గ్రామ ప్రజలు పాల్గొన్నారు



గిమ్మలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న సోయం బాపురావు

సేవ్ ఆదివాసీ పేరిట త్వరలోనే దేశవ్యాప్త ఉద్యమం

- జీవో 49 రద్దు చేసే వరకు కేంద్రంపై పోరాటం : సోయం బాపురావు
- ఘనంగా రాజ్ గోండ్ సేవా సమితి ప్రమాణ స్వీకారం



కార్యక్రమానికి హాజరైన ఆదివాసీలు

ఆదిలాబాద్ టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటాలు చేస్తామని, జీవో 49 గెజిట్ కాకుండా కేంద్రంపై తమదైన రీతిలో పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని మాజీ ఎంపీ సోయం బాపురావు స్పష్టం చేశారు. రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఆదివారం ఆయన ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు కొమురం భీం విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళి సమర్పించారు. కొమురం భీం చౌక్ నుంచి సభ ప్రాంగణం వరకు భారీ ఎత్తున ర్యాలీ చేపట్టగా.. ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించేలా డోలు వాయిద్యాలు వాయిస్తూ ఆదివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా సోయం బాపురావు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు కార్యక్రమ అతిథులు, నేతలు, ఆదివాసులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసిలపై కేంద్రం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సేవ్ ఆదివాసీ పేరిట దేశవ్యాప్త ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. తాను రెండడుగులు వెనక్కి వేసినంత మాత్రం తగ్గినట్లు కాదని, తనను తక్కువ అంచనా వేసిన వారు త్వరలోనే విలువ తెలుసుకుంటారని పేర్కొన్నారు. రాజ్ గోండ్ సేవ సమితి చేపట్టిన పోరాటాలతో రాష్ట్ర ప్రభుత్వం జీఓ 49పై సానుకూల నిర్ణయం తీసుకుందని అన్నారు. జీఓ 49ను గెజిట్ చేయకుండా కేంద్రంపై పోరాటాలు కొనసాగిస్తామని, పార్లమెంట్ సమావేశాలు ఎన్ని రోజులు సాగితే అన్ని రోజులు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. గతంలో తన ఇల్లు అమ్మి ఆదివాసీల కోసం పోరాటం చేశానని గుర్తు చేసిన ఆయన... అవసరమైతే ప్రస్తుతం ఉన్న ఇంటిని సైతం అమ్మి ఆదివాసీ సమాజ అభ్యున్నతి కోసం పాటు పడతానన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా రాజ్ గోండ్ సేవా సమితి పోరాడుతుందని, ఎటువంటి సమస్య ఉన్న వారి వెంట ఉంటుందని పునరుద్ఘాటించారు. అంతకుముందు ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ.. ఆదివాసీలు ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అన్ని సంఘాలు ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యంగా పని చేయాలని, విడిపోతే ఫలితం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, బోథ్ ఇన్‌చార్జి ఆడె గజేందర్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ఆదివాసీ పటేళ్లు, సార్మేడీ లు, తదితరులు హాజరయ్యారు.